జీవనోపాధులు

... భవితవ్యం

ఆగస్టు 2016

‘బృహత్ ప్రయత్నం’

# గుడ్ల విప్లవం

గత మూడు దశాబ్దాలలో భారతదేశంలో కోడిగుడ్ల ఉత్పత్తి అతి వేగంగా పెరిగింది. ఇది ఏడాదికి 6–8% వంతున పెరుగుతూ పోతోంది. ఇది వ్యవసాయాభివృద్ధి రేటుకన్నా ఎక్కువ. దానికి తోడు 2015–16 సంవత్సరంలో 78 బిలియన్ల కోడిగుడ్ల ఉత్పత్తితో భారతదేశం చైనా,అమెరికాల తర్వాత గుడ్ల ఉత్పత్తిలో మూడో స్థానంలో నిలిచింది. కొద్ది మంది వ్యక్తుల కృషి, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ కార్యక్రమాల వల్ల ఒకప్పటి పెరటి కార్యకలాపం నేడు ఉత్పత్తి, సరఫరాపరంగా ఒక వాణిజ్యపరమైన, సంఘటిత పరిశ్రమగా రూపుదిద్దుకుంది. ఈ నేపథ్యంలో ‘జీవనోపాధులు’ గుడ్ల విప్లవం, ఆ విప్లవాన్ని వేగవంతం చేసిన కారణాలను పరిశీలించింది.






గత మూడు దశాబ్దాలలో భారతదేశంలో కోడిగుడ్ల ఉత్పత్తి అతి వేగంగా పెరిగింది. ఇది ఏడాదికి 6-8% వంతున పెరుగుతూ పోతోంది. ఇది వ్యవసాయాభివృద్ధి రేటుకన్నా ఎక్కువ. దానికి తోడు 2015-16 సంవత్సరంలో 78 బిలియన్ల కోడిగుడ్ల ఉత్పత్తితో భారతదేశం చైనా, అమెరికాల తర్వాత గుడ్ల ఉత్పత్తిలో మూడో స్థానంలో నిలిచింది. కొద్ది మంది వ్యక్తుల కృషి, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ కార్యక్రమాల వల్ల ఒకప్పటి పెరటి కార్యకలాపం నేడు ఉత్పత్తి, సరఫరాపరంగా ఒక వాణిజ్యపరమైన, సంఘటిత పరిశ్రమగా రూపుదిద్దుకుంది. ఈ నేపథ్యంలో 'జీవనోపాధులు' గుడ్ల విప్లవం, ఆ విప్లవాన్ని వేగవంతం చేసిన కారణాలను పరిశీలించింది.

మనిషి ఆరోగ్యానికి అవసరమైన ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు మొదలైనవన్నీ కోడిగుడ్లలో పుష్కలంగా ఉన్నాయి. తొమ్మిది అమినో యాసిడ్లు కలిగిన కోడిగుడ్డును సంపూర్ణ ప్రొటీన్‌గా భావిస్తారు. ఈ అమినో యాసిడ్లు మనిషి శరీర ఎదుగుదలకు, అభివృద్ధి చెందడానికి చాలా అవసరం. పోషకాహార విభాగంలోకి వస్తే, కోడిగుడ్లు తల్లి పాల తర్వాత రెండోస్థానంలో ఉన్నాయి. కోడిగుడ్డు నుంచి మన శరీరానికి అవసరమైన న్యూట్రియెంట్లు, ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు అన్నీ అందుతాయి. కోడిగుడ్డు అత్యంత శక్తినిచ్చే ఆహారం. ఇది జీర్ణక్రియను, రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. పిల్లలు, వృద్ధుల విషయానికి వస్తే, అతి సులభంగా జీర్ణమయ్యే గుడ్డును రోజువారీ ఆహారంగా ఇవ్వవచ్చు. ఇతర ఆహార పదార్థాలలోని ప్రొటీన్లను కొలవడానికి శాస్త్రవేత్తలు కోడిగుడ్డునే ప్రామాణికంగా తీసుకుంటారు. జాతీయ పోషకాహార సంస్థ (NIN) కోడిగుడ్డును పోషకాహారపరంగా అత్యంత సమతుల్యత కలిగిన ఆహారంగా పేర్కొంది.

1960, 70లలో కోడిగుడ్ల ఉత్పత్తి కేవలం ఒక పెరటి వ్యాపకంగా ఉండేది. రైతులు జీవనోపాధి కొరకు ప్రధానంగా వ్యవసాయం మీదే ఆధారపడేవారు. రైతులకు అదనపు ఆదాయంగాను, కుటుంబ అవసరాల నిమిత్తమూ, లేయర్ ఫార్మింగ్(గుడ్ల కోసం కోళ్ల పెంపకం)ను చేపట్టేవారు. కోడిగుడ్ల ఉత్పత్తి పరిశ్రమ మొదట చాలా నెమ్మదిగా ప్రారంభమైంది. రైతు దృష్టి నుంచి చూసినప్పుడు స్థానిక కోళ్ల జాతి గుడ్ల ఉత్పత్తి చాలా తక్కువగా ఉండేది. వినియోగదారుని వైపు నుంచి చూసినప్పుడు తక్కువ రేటుకు గుడ్లను కొనుగోలు చేయడమనేది ప్రధాన సమస్యగా ఉండేది. ఇక గణాంకాలపరంగా చూస్తే, 1960లో ఏడాదికి సగటున 7 గుడ్ల వినియోగంతో ఆనాటి కోడిగుడ్ల పరిశ్రమ ఎంత చిన్నదో అర్థం చేసుకోవచ్చు.

1980ల నాటికి కోడిగుడ్ల పరిశ్రమ పెరిగింది. తలసరి వినియోగం ఏడాదికి 15 గుడ్లకు పెరిగింది. అయితే ఈ క్రమంలో కొన్ని కొత్త సవాళ్లు ఎదురయ్యాయి. అవి: లేయర్ ఫార్మింగ్‌ను చేపట్టే రైతులకు కోడిగుడ్ల ఉత్పత్తిని పెంచే సాంకేతిక పరిజ్ఞానం కానీ, సమాచారం కానీ, విజ్ఞానం కానీ అందుబాటులో ఉండేది కాదు. దీని వల్ల నష్టాలు ఎక్కువగా ఉండేవి. కోళ్ల దాణా, ఇతర ఉత్పాదకాల ఖర్చులు ఎక్కువగా ఉండేవి. కోడిగుడ్ల ధరలు స్థిరంగా ఉండేవి. దళారులు ఎక్కువగా లాభం పొందడం వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూరేది కాదు. లేయర్ రైతులకు వచ్చే లాభంకన్నా వారికి గుడ్ల ఉత్పత్తిలో అయ్యే ఖర్చు ఎక్కువగా ఉండేది.

ఈ పరిస్థితులలో సుమారు 40% మంది లేయర్ రైతులకు కోడిగుడ్ల ఉత్పత్తిని ఆపేయడం తప్ప వేరే ప్రత్యామ్నాయం లేకపోయింది. దీంతో స్వయంగా ఒక పౌల్ట్రీ రైతు అయిన బీవీ రావు కోడిగుడ్ల అమ్మకపు ధర నిర్ణయించడంలో రైతు పాత్ర ఉండాలని భావించారు. ఆయన చిన్నా పెద్దా పౌల్ట్రీ రైతులను కలిసి, వారితో చర్చించి, ఒక అంగీకారానికి వచ్చారు. అక్కడి నుంచి ఆయన ప్రయాణం ప్రారంభమైంది. ఆయన దేశవ్యాప్తంగా పౌల్ట్రీ రైతుల బృందాలు, వ్యక్తులు, వ్యాపారులతో 300కు పైగా సమావేశాలు ఏర్పాటు చేసి 'నా గుడ్డు, నా ధర, నా జీవితం' అనే నినాదం తీసుకొచ్చారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం పౌల్ట్రీ రైతులందరినీ సంఘటితపరచడం.

1988లో బీవీ రావు పౌల్ట్రీ రైతుల సంస్థ అయిన జాతీయ కోడిగుడ్ల సమన్వయ కమిటీ (NECC)ని స్థాపించారు. దానికి ఆయన ఛైర్మన్‌గా ఉండేవారు. NECCని సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టం కింద రిజిస్టర్ చేయించారు. దీని ప్రధాన లక్ష్యం కోడిగుడ్ల ధరలను మెరుగుపరచడం, తద్వారా భాగస్వాములందరూ – రైతులు, దళారులు, వినియోగదారులంతా సంతోషంగా ఉండేట్లు చేయడం. ఆ తర్వాత ఇది మార్కెట్‌లో రంగప్రవేశం, మద్దతు ధర కార్యకలాపాలు, కోడిగుడ్డు ప్రోత్సాహక ప్రచారం, వినియోగదారుల్లో అవగాహన, మార్కెట్ పరిశోధన, గ్రామీణ మార్కెట్ అభివృద్ధి, పరిశ్రమకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై ప్రభుత్వంతో సంబంధాలకు తన పరిధిని విస్తృతం చేసుకుంది.

NECCలో ప్రస్తుతం 25 వేల మందికి పైగా పౌల్ట్రీ రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సంస్థలపరంగా ప్రపంచంలో ఇది అతి పెద్దది. NECC కోడిగుడ్ల ఉత్పత్తి, ఉత్పాదకత విషయంలో చాలా ముఖ్యమైన పాత్రను పోషించింది.



NECC ప్రధాన లక్ష్యాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి –

* దేశవ్యాప్తంగా ఉన్న పౌల్ట్రీ రైతులను సమీకరించి, సంఘటితపరచడం

* రైతులకు తగిన ఆదాయం, వినియోగదారునికి తక్కువ ధరకు గుడ్ల లభ్యత, వ్యాపారులకు తగిన మార్జిన్ లభించేలా కోడిగుడ్ల ధరలను నిర్ణయించడం

* దేశవ్యాప్తంగా ఉన్న కోడిగుడ్ల ఉత్పత్తి కేంద్రాలను పర్యవేక్షించడం

* కోడిగుడ్ల స్టాక్ కదలికలను పర్యవేక్షించడం, సప్లై–డిమాండ్‌లకు మధ్య ఉన్న అంతరాన్ని తొలగించేందుకు గుడ్ల ఉత్పత్తి ఎక్కువగా ఉన్న ప్రదేశం నుంచి తక్కువ ఉత్పత్తి ఉన్న ప్రదేశాలకు తరలించడం.

* అగ్రోకార్పెక్స్ ఇండియా లిమిటెడ్ ద్వారా మార్కెట్ కార్యకలాపాల నిర్వహణ

* దేశంలోని ప్రతి గ్రామంలోని ప్రతి కుటుంబానికి కోడిగుడ్లు అందేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవడం.

* కోళ్ల పెంపకం, వ్యాపారం, ప్రాసెసింగ్ మొ.వి. వాటి ద్వారా ఉపాధి కల్పన పెంపు

* కోడిగుడ్ల ఉత్పత్తిని పెంచేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, సమాచారం పౌల్ట్రీ రైతులకు అందుబాటులోకి తీసుకురావడం.

* కోడిగుడ్ల ఉత్పత్తిని పెంచేందుకు బ్యాంకుల నుంచి పౌల్ట్రీ రైతులకు పెట్టుబడికి అవసరమైన రుణ మంజూరు కోసం ప్రభుత్వంతో కలిసి పని చేయడం.

* కోడిగుడ్లపై వినియోగదారుల్లో అవగాహన పెంచడం. కోడిగుడ్ల వినియోగానికి అడ్డంకులుగా ప్రజల్లో ఉన్న అనేక భ్రమలను, తప్పుడు అభిప్రాయాలను తొలగించేలా అవగాహనా కార్యక్రమాలు

* మార్కెట్ పరిశోధన, గుర్తింపు, అభివృద్ధి



**ప్రజాదరణ మరియు కోడిగుడ్ల ఉత్పత్తికి భవిష్యత్తులో ఉన్న అపార అవకాశాలు:**

మన దేశ జనాభా 1.23 బిలియన్లు. దీనిలో ఎక్కువ శాతం యువతే. దేశ భవిష్యత్తు ఈ యువత ఆరోగ్యం మీదే ఆధారపడి ఉంది. ప్రభుత్వం కేవలం ప్రజలకు ఆహార భద్రత కల్పించడం మాత్రమే కాదు, వారికి నాణ్యమైన పోషకాహారాన్ని కూడా అందించాల్సి ఉంటుంది. దేశ పౌష్టికాహార స్థితిని మెరుగు పరచడంలో పౌల్ట్రీ పరిశ్రమే కాకుండా కోడిగుడ్ల పరిశ్రమ కూడా చాలా ముఖ్య పాత్రను పోషిస్తోంది.

మొదటిది – భారతదేశం చేయదగినవి, చేయకూడనివి అని అనేక

ఆంక్షలుండే క్లిష్టమైన సంస్కృతి కలిగిన దేశం. మతపరమైన విశ్వాసాలు, వాటితో ఆహారానికుండే సంబంధాలు ఈ సంస్కృతిలో ఒక ముఖ్యభాగం. మన దేశంలో అనేక మతాలుండడం వల్ల, అందరికీ ఆమోదయోగ్యమైన ఆహారాన్ని కనుగొనడం కష్టసాధ్యం. ఇక్కడే కోడిగుడ్లు రంగంపైకి వస్తున్నాయి. చాలా మతాలకు పౌల్ట్రీ, కోడిగుడ్లతో సమస్యలు లేనందువల్ల, కోడిగుడ్లకు మార్కెట్ అవకాశాలు చాలా ఎక్కువ.

రెండోది – ప్రపంచీకరణ కారణంగా మన యువత ఆలోచనల్లో చాలా మార్పు వచ్చింది. అనేక బహుళజాతి సంస్థలో పెద్దపెద్ద జీతాలను సంపాదిస్తున్న యువత, తమ నిత్య జీవితంలో పశుసంబంధిత ప్రొటీన్లను అంగీకరిస్తున్నారు.

మూడోది – నేడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు ఎక్కడపడితే అక్కడ వెలుస్తున్న నేపథ్యంలో కోడిగుడ్లు, వాటి ఉత్పత్తులకు డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది.

కోడిగుడ్లకు ప్రజాదరణ పెంచే ప్రభుత్వ కార్యక్రమాల వల్ల ప్రజల పౌష్టికాహార స్థాయి పెరగడమే కాకుండా, వాటి ద్వారా అనేక మందికి జీవనోపాధి కూడా లభిస్తోంది .ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకం, అంగన్‌వాడీలు, సైన్యం మెనూలో కోడిగుడ్లను తప్పనిసరి చేసింది. ఇటీవలి కాలంలో కోడిగుడ్ల తలసరి వినియోగం 62కు పెరిగినప్పటికీ, తలసరి వినియోగం 180కి పైగా ఉండాలని నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో, దీనిని ఇంకా పెంచేందుకు వందశాతం అవకాశాలున్నాయి. ✷